# త్రినేత్రుడు

[కథానిక]

= శ్రీ శివరాజు వేంకటసుబ్బారావు =

ఆదర్శంతో రక్తాన్ని మత్తెక్కించి మూగదైపోయిన ఈప్రపంచంపైన అప్పుడప్పుడు నాకు కోపం వొస్తూవుంటుంది. నా కేం కావాలో నాకే తెలీదు; ఎన్నో జరిగేసూచన లున్నా, ఏమీ జరగదు; జీవితానికి అర్థం లేదు. ఇట్లా అకారణమైన ఆగ్రహాన్ని అణుచుకునే అవసరం వున్నప్పుడల్లా నాకు గౌరీశంకర శాస్త్రిగారి దగ్గర కెళ్లడం మామూలు. గిరీశం అన్నట్లు ఆయనతో మాట్లాడడమే వొక 'ఎడ్యుకేషన్'. పగటినీ, రాత్రినీ పరిణయంచేసుకున్న సంధ్యలా, ఆయన ప్రాచీననాగరికతకి వొక బహిర్గతచిహ్నంలా గోచరిస్తాడు.

ఆయనవయస్సెంతో శాస్త్రిగారిని నే నెప్పుడూ అడగలేదు. డెబ్భై, డెబ్భైఆరు, ఎనభై కూడా నేమో! వృక్షాలు, కొండలు—వీటి వయస్సు నిర్ణయించడం శాస్త్రకారులకి కష్టం కాదు; కాని ఎవరిక్కావాలి? వార్ధక్యంలో పడ్డ మానవుడి జీవితంలోని పరిపూర్ణత వయస్సుమీద ఆధారపడదు. ముందు వెనక, మంచి చెడ్డా, ఎత్తు పల్లం—పరిపూర్ణత లేని నడివయస్కులు వీటి కొలతబద్దలు.

శాస్త్రిగారితో వున్న కాసేపూ సత్యాసత్యాలకు తావులేదు. ఆయనలో కుళ్లు, కుట్ర, రహస్యం, అంతరంగికం వున్నట్లు కనబడదు. ఆయన కసలు వ్యక్తిత్వం లేదు; వున్నా నవ్వుకీ, కన్నీటికీ అది అతీతం. ఆయన అనుభవాలూ, వుద్రేకాలూ అన్నీ శరీరంమీదే బిగ్గరగా బరువుగా కనిపిస్తూవుంటాయి. తీరని వాంఛలన్నీ ముడతలలో తీర్చబడ్డాయి; నీరైన కలలన్నీ నేత్రాల వెనక చలితో వొణుకుతున్నాయి. ముందు వెలిసి, చివర అంతర్ధానమైన నక్షత్రంలా వొకటే పన్ను. చాలామంది ముసలాళ్లమాదిరి ఆయనది బట్టతలకాదు. వెండితీగలలా, మెరుపులా మెరిసే, లెక్క పెట్టేటందుకు వీలుగా అమర్చబడ్డ తెల్ల వెంట్రుకలు. తపస్సు విరమించి కుటీరంలోకి కూర్చున్న యోగిలా, జీవితరహస్యాన్ని దాచుకున్న చిత్రమైన గడ్డం. ముసుగు తొలగించుకుని హృదయం ఆయనశరీరంలోనే మసలుతూవుంటుంది. ఆత్మకి ఆకారం వుంటే ఆయనలా వుంటుంది. ఆయనకి ఆలోచన లేదు. ఆలోచించే అవసరమే వొస్తే, ఆ పని ఆయనశరీరమే చెయ్యగలుగుతుందేమో ననిపిస్తుంది. వార్ధక్యం అంత అందంగా వుంటే, యవ్వనాన్ని నిలబెట్టేటందుకు యత్నాలు చేస్తున్న శాస్త్రకారులని పిచ్చాస్పత్రిలో వుంచాలనిపిస్తుంది నాకు. అప్పుడప్పుడు ప్రపంచంపై ఆగ్రహం వొస్తుదని చెప్పా మొదట్లో. శాస్త్రిగారిలాంటి వ్యక్తులు యీ దేశంలో చాలామంది ఎందుకుతేరా అన్నది అనేక కోపకారణాలలో వొకటి. ఆయనది చిత్రకారుడికి చైతన్యం యిచ్చే ఆకృతి. కాని ఆచైతన్యంలో దుఃఖం వుండితీరుతుంది.

అంతే కాదు. అర్థశూన్యం అని తోచిన జీవితానికి ఆయన అర్థం కల్పించగలడు. జీవితప్రవాహానికి ఆయనజీవితం ఆనకట్ట. లోకానికి ఆకారం, ఆకృతి యివ్వగలడు. ఆయనఅనుభవాలు చాలా సాధారణమైనవే. చేసిన వుద్యోగం తాలూకాగుమాస్తా; ఆర్జించింది ఆరెకరాల భూమి; కొడుకు యిప్పుడు ఊటీలో వున్నాడు; కూతురు భర్తతో సిమ్లాలో కాపరం చేస్తున్నది. ఆయన తోటలో గుడిసెలో వొంట

రిగా కాపరం— భార్య పోయి పదేళ్లయింది;— హోటల్ మెదుకులు; చుట్ట, చదరంగం— అంతే ఆయన జీవితం. కాని ఆయనచరిత్ర వింటే ప్రతిఅనుభవమూ వొక నాటకంలా కనిపిస్తుంది. ఆయనఅనుభవాలు విషాదాంతగీతికలు. ఈసాధారణ అనుభవాలతో ఆయన జీవితాన్ని ఎట్లా అర్థం చేసుకున్నాడో నా కింత వరకూ తెలీదు. ఆయనకికూడా తెలీదేమో. కేవలం కబుర్లతో, మాటల్తో నాలో యీభ్రమని జనింపచేశాడా? ఒకొకప్పుడు ఆయన చెప్పినవన్నీ అసత్యాలేమో నన్న సందేహం వొస్తూంటుంది. కాని ఆ అనుమానం ఆయనముందు వున్న కాసేపూ రాదు. 'ఊహ' తో యథార్థ జీవితాన్ని జయించి, భావంతో రహస్యాన్ని ఛేదించాడు కాబోలు. ఆస్కార్ వైల్డు ఎక్కడో "అసత్యాలాడడం, అందమైన ఆకర్షణీయమైన అబద్ధాలు చెప్పడం—యిది కళయొక్క ముఖ్యోద్దేశం" అన్నాడు. దీన్నిబట్టి చూస్తే గౌరీశంకర శాస్త్రి చాలా గొప్ప 'ఆర్టిస్ట్'.

సాయంత్రం నాలుగైంది. మర్రిచెట్టుకింది దిమ్మమీద శాస్త్రిగారు కూర్చున్నారు — శూన్యత్వాన్ని తిలకిస్తూ. ఆయన కాల్చే చుట్టలో పొగమాదిరి భావాలు ఎక్కడనుంచి జనిస్తాయో, ఎక్కడికి పోతాయో వూహించలేను. వెళ్లగానే నమస్కారం చేసి నేనూ కూర్చున్నాను.

"శాస్త్రిగారూ, నాకు జీవితంలో అర్థం కనబడలేదండి"

"నువ్వు బ్రహ్మచారివి. 'జీవితం' అనే మాటని అస్తమానూ సులభంగా వుపయోగించకూడదు" అన్నాడాయన. ఆయనతో ఏదో మాట్లాడించాలనితప్ప నా భావాలకి వేరే అర్థం కనిపించడం లేదు.

"మనుషులకంటె జంతువులు ఎంతో సుఖంగా వున్నాయనుకుంటా" అన్నాను మళ్లా.

"కావొచ్చు. 'మనుషు'లనడంకంటె 'పురుషుల'కంటె అను; నేను ఖండించను. స్త్రీలున్నారని మరిచిపోకు. వాళ్లకి తిండికోసం పాటుపడే అగత్యం లేకపోతోంది" అన్నాడాయన.

"కాని స్త్రీలకి జంతువులకంటె ఎక్కువ గౌరవం లేదనుకుంటా. శాస్త్రజ్ఞులు పురుషుల ప్రాచీనులు కోతులని వాదిస్తున్నారు. స్త్రీల ప్రాచీను లెవరా అని సందేహంగా వుంది" అన్నా.

"స్త్రీల ప్రాచీనులూ కోతులే; ఆడకోతులు" శాస్త్రిగారి పెదవులు నవ్వుకోసం ఎంతో పెనుగులాడాయి. ఆయన్ని బాగా పరకాయించి చూశాను. చలికి ముడుచుకున్న అరణ్యవృక్షాలమాదిరి చర్మంవిపరీతంగా చలించింది. ఆనాడు ఆయనలో కొత్తవిషయం—యిదివరకెన్నడూ గుర్తించనిది చూశాను. కనుబొమ్మలమధ్య నుదుటిమీద నల్లటి, కొంచెం పొడుగాటి మచ్చ వుంది.

"శాస్త్రిగారూ, ఆమచ్చ ఏమిటో చెప్పారు కాదు"

ఆయన లేచి ఎండలోకి నడిచాడు. నాముందు ఆయననీడ పడింది—ఆయనలాగే చలించని నీడ.

"దానికి చాలా కథ వుంది"

"నాకు చెప్పాలి"

"ఆ మచ్చ నా మూడో నేత్రం"

నాకు నవ్వొచ్చింది. నీడ బోసినోరు విప్పింది.

దాని పూర్తి కథ చెప్పమని బ్రతిమలాడాను. "ఇక్కడ కాదు, నాతో రా." ఆయన ఎడమ చెయ్యి నాభుజంమీద ఆనించి కుడిచేత్తో కర్ర పట్టుకుని నడవడం మొదలెట్టాం. గాలి పిలుపుకి ఏకంగా కదిలిపొయ్యే కొండమీది మేఘంలా ఆయన నడుస్తూ నాకీ కథ చెప్పడం ప్రారంభించాడు.

"అది జరిగి చాలాకాలమైంది. అప్పటికి నా వయస్సు యిరవై ఆరు- దాని కింకా ఇరవైకూడా రాలేదు. మా కుటుంబానికి ఆరో ఏడు; మా కుముదం మూడేళ్లది. నాకు బాగా జ్ఞాపకం— ఆనాడు ఆదివారం; సాయంత్రం ఆరుగంటలకే అది నెప్పులు పడడం నే గ్రహించలేకపోలేదు. మరిచా, కుముదం తల్లిని నువ్వు చూశావా ?"

"—లేదు, ఆభాగ్యం కలగలేదు. పోనీ, మీ దగ్గర వున్న ఫొటోయేనా చూపించండి—"

"దాని ఫోటో లేదు. అంత అందమైన స్త్రీలు యీ రోజుల్లో నాకు కనబడడం లేదు. పోనీ, మా కుముదాన్ని చూశావా?"

"—ఆ. ఆ. చాలా సుందరమైన విగ్రహం. ఆమెనుబట్టి ఆమెతల్లి ఎట్లా వుండేదో ఊహించగలను—"

"అదే పొరబాటు. ఊహించలేవు. వాళ్ల అమ్మముందు కుముదం కోతిపిల్ల. ఆరోజుల్లో తాసీల్దారుకి నామీద ఎంతో గౌరవం, దయ— ఎందుకంటావ్? ఆయ నెప్పుడో నాభార్యని చూశాడు. ఇప్పుడు నా కనిపిస్తోంది— అంత అందమైన స్త్రీని ఎవరూ పెండ్లి చేసుకోకూడదని. అట్లా చెయ్యడం పాపం. పార్కులో రేడియో పదిమంది వింటారు; గౌరీశంకర్ శిఖరాన్ని అందరూ దూరాన్న చూస్తారు; సినిమా షో అంతా అనుభవిస్తారు; తాజ్ మహల్‌ని మెచ్చుగుంటారు. ఎవరూ యీ వొస్తువులు 'నావి' అనరు. అట్లాగే అందమైన స్త్రీలు. సౌందర్యం అనేది వొక సామ్యవాద సంస్థ.— ఏ వొక్కడికీ చెందకూడదు."

—ఇది వినగానే వెంకటచలం, ఒమార్ ఖయ్యామ్, లారెన్సు, జాయిస్ అంతా స్మరణకు వొచ్చారు.

"కాని ఆనాడు నా భార్య వొక సంస్థలా కనిపించలేదు. అది నాది, నాఆస్తి; దానిమీద హక్కు నా వొక్కడికే వుంది. అది యీ సంఘానికి చెందిన వొస్తువనీ, కాబట్టి ఎప్పుడో యీసంఘం దాన్ని తీసుకుపోయి సంస్థగా చేస్తుందనీ భయంగానూ, తీవ్రమైన అసూయగానూ వుండేది. ఈ అసూయ నా శాంతిభంగానికి కారణం.

ఆ సాయంత్రం మూడోకాన్పు నెప్పులుపడడం చూసేసరికి నాగుండె గుభేలుమంది. తెల్లారితే ఆఫీసు. కారణం చెప్పకుండా సెలవడిగితే తాసీల్దారు యివ్వడు; కారణం చెబితే కనుక్కోడంవొంకని యింటికొచ్చితీరతాడు. అది నేను సహించలేనిది. చేతులో కానీ లేదు. మొగడాక్టర్ని పిలిపించి దాన్ని పరీక్ష చేయించడం నాకు సుతరామూ యిష్టంలేదు. పైగా నాకు పిల్లలంటే పరమఅసహ్యం. ఎందుకంటావ్? పిల్లలు దాని సౌందర్యాన్ని, నాఅల్పగణింపునీ సమంగా పంచుకుంటారని వాళ్లంటే అసూయ. నా యిరువురి సంతానం దాన్నప్పుడే పంచుకుంటున్నారు. మళ్లా మూడోదా! పిల్లలకితప్ప నాకు చెందదని ఏదో వెర్రి భయం. సంతానం దాన్ని తినేసి అస్థిపంజరం నాకు మిగిలిస్తే, దాన్ని నే తగలేసి, వాళ్లు చేసిన ఘనకార్యానికి ఆస్తంతా వాళ్ల కప్పజెప్పటమా? 'వివాహం' అనే సంస్థలో స్వార్థం వుందంటారు. కాని, చాలా పొరబాటు. అది శాసించికోరే స్వార్థత్యాగంలో సగం వ్యయంచేస్తే భారతదేశానికి స్వాతంత్ర్యం ఏనాడో వచ్చును. సౌందర్యమైన స్త్రీని నాబోటి పోషించలేని అధముడికి కట్టడం ఎంత పాపమో, ప్రతిభాశాలిని 'వివాహం' అనే సంస్థలో బంధించడం అంతే పాపం. ఈరెంటినీ మించిన పాపం పోషించే శక్తి లేకుండా పిల్లల్ని యీలోకంలోకి తీసుకురావడం.

ఈ అభిప్రాయాలు దానికి వొకటీ అర్థంకావు. అసలు దానికి ముందూవెనకా ఆలోచనే లేదు. పువ్వు పరిమళాన్నిచ్చినట్లు, చంద్రుడు చల్లదనాని చిమ్మినట్లు పిల్లల్ని కనడం దాని సహజసైజంలా ప్రవర్తిస్తుంది. ఆరాత్రి నాకు భయంకరమైన కలొచ్చింది. ఆకలలో నాభార్య నాతో యిట్లా మాట్లాడింది — [నే మోసి కన్న సంతానాన్ని నా కలలు సృష్టించాయి; నాఅందం వాళ్లకి చక్కదనాన్నిస్తుంది. ఆకలికి నాహృదయాన్ని, దాహానికి నారక్తాన్ని అర్పించాను. నా ఆత్మలో నిద్రపోయి, అమాయకంగా నా రొమ్ములమీద పరుండి, జీవించి నన్ను శపించి, చివరకి చచ్చిపోతారు. నా కుటుంబం పెద్దవాడయ్యాకు. అప్పుడు వొక దుర్మార్గురాలు నరకాన్నుంచి వొచ్చి నాపాపని దొంగిలించింది. దాని పెదవులు, క్రూరమైన కళ్లు మత్తుతో ఎర్రగా వున్నాయి. నన్ను తగలబెట్టేటందుకు దాచుకున్న కాస్తబంగారాన్ని దాని ముద్దకోసం అర్పించి నాచావుని కోరాడు నాపుత్రుడు. నా తలకింద దాచుకున్న బంగారంకోసం నిద్రపోతున్నప్పుడు దొంగతనాని

కొచ్చాడు. కుటుంబం. మెల్లగా వొస్తున్న అతని అడుగులు నాహృదయంలో ప్రతిధ్వనించాయి. తన మొహాన్ని వొంచి, సర్పంలాంటి కత్తిని నాగుండెలో త్రిప్పి నన్ను చంపిన ధ్వని శ్మశానవాటికలో వినిపించింది–మరణించినవాళ్లు మళ్లా మరణించ రన్నవాళ్లు అసత్యవాదులు...]

భయపడి లేచాను. దాని నెప్పులు, మూలుగుడూ ప్రక్కగదిలోంచి వినిపిస్తూనే వున్నాయి. జనించబోయ్యే శిశువుని ఎట్లా చంపను? చంపాలని లేచా,... అప్పుడే ఆకాశంలో సూర్యుడు వొంటికన్నువాడిలా కుంటుకుంటూ లేస్తున్నాడు. చరచరా పరుగెట్టి, కాలు జారి మంచంకోడుకి నామొహాన్ని కొట్టుకున్నా. గాయం పడిందికాని రక్తం రాదే—ఉన్మాదానికి రక్తం గడ్డకట్టింది కాబోలు. మంత్రసాని ఎదురుగా వొచ్చి "మొగశిశువు" అని చెప్పి నవ్వుతో నాకేసి చూసి, కెవ్వున కేకెట్టి, చేతులో బెడ్ పేన్ వొదిలేసి పరుగెత్తింది. నా కర్థంకాలేదు. వీథులో కొచ్చాను. మంగలి నన్ను చూసి 'పొది' వొదిలేసి 'బాబో' అని పరుగెత్తడం మొదలెట్టాడు. వీథిగదిలో కుర్చీలో కూలబడ్డాను. నుదురు తడుముకున్నాను. గాయం; రక్తం లేదు. వీళ్ల చర్య నాకేమీ అర్థంకాలేదు.

ఎట్లా తెలిసిందో—తాసీల్దారుకూడా చక్కా వొచ్చాడు. నన్ను చూసి గుమ్మంలో నిలబడిపోయాడు. కుర్చీ సర్ది "దయచెయ్యండి" అన్నాను. ఆయన మాట్లాడడు.

"మొగపిల్లాడుట. ప్రమాదం లేదు...రండి..." ఆయన కొయ్యబారి నాకేసి అదేపనిగా చూడడం మొదలెట్టాడు. నా కాయనమీద కోపం వొచ్చింది. దానికీ పిల్లాడు పుట్టడంలో యీయనకికూడా ఏమన్నా వాటా వుందా? లేకపోతే యీయన కెందుకు యింతకుతూహలం, యింతఆశ్చర్యం?

"శాస్త్రీ, నీ నుదుటిమీద ఏమిటది– కన్నులా వుంది?"అన్నాడు నానుదుటికేసి తన వేలినిచూపుతూ.

"తొందరలో వెడుతుంటే దెబ్బ తగిలింది."

"దెబ్బలా లేదు. అద్దంలో చూసుకో, సరిగ్గా కంటిలా వుంది...మూడో నేత్రం."

అద్దంలో చూసుకున్నా. ఏమీ లేదు, మామూలు దెబ్బే. నల్లగా గొయ్యిలా పడింది. రక్తం కారకపోవడం వొక్కటే విశేషం. తాశీల్దారు భయపడుతూ దగ్గరగా వొచ్చి నా దెబ్బని పరీక్షగా చూశాడు.

"నిస్సందేహంగా మూడోనేత్రమే. అదేమిటి, కనబడుతుంటేనే! నువ్వు ధన్యుడవు శాస్త్రీ. అవతార పురుషుడవు. ఇప్పుడు నీ భార్యకి పుట్టిన పిల్లాడు కేవలం భగవంతుడే. నువ్వు త్రినేత్రుడవు." అంటూ చేతులుజోడించి నాపాదాలమీదపడడం మొదలెట్టాడు.

ఈ పరిహాసానికి నాకు కోపం మరింత ఎక్కువైంది. ఈ తాశీల్దారుకీ, కొత్తగా పుట్టిన పిల్లాడికీ ఏదోసంబంధంఉందన్న నాఅనుమానం బలపడుతోంది. అసలు విషయం కప్పిపుచ్చేటందుకు యిదేదో పన్నాగం పన్నుతున్నాడని నిశ్చయం చేసుకుంటున్నా. కాని ఆమంత్రసానీ, మంగలీవాళ్లు యిల్లాగే ఆశ్చర్యం ప్రకటించి, చకితులై పారిపోయ్యారే!

"తమరు పెద్ద వుద్యోగులు; నే నేదో బీదవాణ్ణి. నన్ను తమ రిట్లా పరిహాసం చేస్తే ఎట్లా?"

"పరిహాసం కాదు శాస్త్రీ. నీ జన్మ తరించింది నేటితో. సృష్టి నీలో కొత్తమార్పుని తీసుకొచ్చింది. నీపాపాలన్నీ పూర్తిగా తొలిగి, జన్మరాహిత్యానికి సిద్ధం కమ్మని దైవం నీకు మూడోనేత్రం ప్రసాదించాడు. నీపుత్రుడు ఆ దైవం. నిన్ను మేం పూజించాలి"

అంటూ ఎన్నోమార్లు నమస్కారాలు చేసి, తొందరగా నిష్క్రమించాడు తాసిల్దారు.

నామనస్సునీ, వాస్తవికతనీ శంకించడం మొదలెట్టాను. మానవుడి అనుభవాలు రెండువిధాలు: మానసికం; ఇంద్రియాన్వేషణ. ఆనాటి అనుభవం యీ రెంటికీ చెందదు. నాకు భయమేసింది. ఈ సంఘం వొక పెద్ద పిచ్చాసుపత్రి. దాని సూపరెంటుని నేను. నాభార్య? దాని స్థానం యీ ఆసుపత్రిలోనే? వేగంగా గదిలోకి పరుగెట్టా. తలుపుసందులోంచి చూశా.

నా భార్య "అమ్మో — నిజమేనే!" అన్నది. ఒళ్లు మండింది నాకు. గదిలోకి ప్రవేశించా.

"ఏమిటి నిజం?" అని గర్జించా.

"అమ్మో—మూడోకన్ను!"

"దెబ్బ"

"అబ్బే, కాదు, కాదు. నిజం. భగవంతుడు" చేతులు జోడించి, నీరసంగా ఏడిచింది. పసిపాపను చూశా. తాసిల్దారు జ్ఞాపకం వొచ్చాడు. ప్రాచీనశక్తులు నాలో చెలరేగాయి. లోకాన్ని నిర్మూలం చెయ్యాలి-లేకపోతే నాబ్రతుకు వెక్కిరింపైపోతుంది. రెండుకళ్లుండికూడా చూడలేకపోతున్న యీ గుడ్డిప్రపంచంలో నా మూడోకన్ను ఎందుకు పనికొస్తుంది? నేను చూడలేని మూడోనేత్రం నాకెందుకు? సృష్టి అవయవాలని మానవుడి ఆనందానికి, అమరతకి యిచ్చింది. ఏ అవయవాన్ని ఉపయోగించకుండా హింసించి కప్పెట్టినా మానవునికి నశింపు తప్పదు. ఉపయోగం లేని అవయవంకంటె వేరే శత్రువు మానవుడికి లేదు. భూమి నాకాళ్లకింద కదలడం మొదలెట్టింది; రంగులు కదిలి చీకటవుతున్నాయి; ఘున్నాలు చదరాలుగానూ, చదరాలు కోణాలుగానూ, ఇంద్రియాలు ఇంద్రజాలం, మంచిచెడ్డలు మట్టి, దైవం దయ్యం, మతం మురికి, రాజకీయం రాళ్లకుప్ప, కళ కాఫీపొడుం, ప్రేమ పొద-లోకం తారుమారై నా అనిశ్చలత్వాన్ని మూడోనేత్రం బిగ్గరగా సాటిస్తోంది. ఆత్మహత్య తప్ప మరి మార్గం లేదు. సృష్టి దాని కంగీకరించదు. ఎవర్ని చంపను? పసిపాపనా, భార్యనా, తాసీల్దారునా—? ముగ్గుర్నీ చంపాలి. పసిపాప ఏడ్పు విని పీక నొక్కాలని వుంది. ఎట్లా చంపను? వీధి గుమ్మంలోకి వెర్రిగా పరుగెత్తా. ఎదురుగా వొస్తున్న మంత్రసాని 'బాబో' అని గంతేసి నాట్యం చేస్తూ గుహలోకి దూరింది. వీధులో జనం గుంపుగా మూగారు — సన్నాయి, డప్పులు, డోళ్లు, తాళాలు. పోలీసులు, ప్లీడరు గుమాస్తా పరమశివం, భోగం నాగులు, డాక్టర్ దానయ్య— వీళ్ల నాయకుడు తాసీల్దారు. పూలమాల నామెళ్లో వేసి నమస్కరించి భజన చెయ్యడం మొదలెట్టారు. పాటలు, పొగడ్తలు, స్తోత్రాలు- నాకు పిచ్చెత్తిపోతోంది. బిగ్గరగా నవ్వాను.

"నేను పిచ్చివాణ్ని. మీరువెళ్లండి, దయచేసి" జనం గుసగుసలు, పెద్దగోలా; పూర్వసువాసినుల ముఠా వొచ్చి కొబ్బరికాయలు కొట్టడం మొదలెట్టారు. ఏం చెయ్యను?

"నేను పిచ్చివాణ్ణి—వెళ్లండి."

"ఓ పరమాత్మా—నువ్వు ఈరూపంగా మాకు దర్శనం యిచ్చావా? మమ్మల్ని పరీక్ష చెయ్యవద్దు. మాకు నీలో చేరుకునే మార్గం బోధించండి." అన్నారు అందరూ.

"ఒకటే మార్గం: నాకన్ను పొగొట్టడం, తాసీల్దారువుద్యోగం తీసెయ్యడం—యీరెండూ చేస్తేరా మీ కీతక్షణం మోక్షం వొస్తుంది." అన్నాను.

"హే ప్రభూ! నాఉద్యోగానికి యీక్షణమే రాజీనామా యిస్తాను! నన్ను మీపాదసేవ చెయ్యనివ్వండి" అన్నాడు తాసీల్దారు. ఎట్లా చావను?

"మీరంతా పిచ్చాళ్లు. పొండి." అన్నా వొళ్లు మండి. అందరూ చెంపలేసుకున్నారు.

"నిజం—ఓ త్రినేత్రుడా! మేం పిచ్చివాళ్లం, శుంఠలం, పశువులం, మహాపాపులం. మమ్మల్ని శిక్షించు, దండించు, చంపు. కాని మోక్షం మాత్రం ప్రసాదించు."

వాళ్లని తోసేసి తలుపులు గడియపెట్టాను. బైట జనం పెద్ద గుంపులుగా మూగి భజన్లు ప్రారంభించారు. నన్ను చూసి నేను భయపడ్డాను. అంతా కలగా వుంది; కాని కలగాదు, నిజం. ఇంతమంది చూస్తున్న మూడోకన్ను నాకెందుకు కనబడదు? వీళ్లంతా గుడ్డివాళ్లా, లేక నేనే గుడ్డివాడినా?

భారతీయులకి దైవం, మతం అంటే అంత పిచ్చి. వాళ్లకి ఆత్మవికాసంతో నిమిత్తం లేదు; ప్రతిదానికీ బహిర్గతచిహ్నం కావాలి. పొరపాటున విష్ణుమూర్తి ఇంగ్లండు వెళ్లాడంటే వెంటనే 'ప్యాస్‌పోర్టు

చూపించమంటారు. దేవుడే వాళ్లదగ్గర కొచ్చి, నేనే దైవాన్నంటే ఋజువుచెయ్య మంటారు. ఆంజనేయుడనంటే తోక చూపమంటారు. బహిర్గతచిహ్నాలు లేకుండా, వీళ్లు జీవితపు విలువల్ని అర్థంచేసుకోలేరు. అనుభవించనూలేరు. రెండు మోటార్లు, బ్యాంక్ ఎక్కౌంటూ వుంటే ధనికుడు; పదిమంది బంట్రోతులు సలాంచేస్తే హోదా; మెడలో పుస్తె లేందే స్త్రీ భార్య కాదు, తల్లి కాదు; ఎవరికీ అర్థంకాని వేదాలని పఠిస్తే పండితుడు; తనకీ అర్థంకాని భాషతో సృష్టినిగురించి వితర్కిస్తే వేదాంతి; పిల్లల్ని కంటే కుటుంబీకుడు; తిండిలేక మాడడం ఆధ్యాత్మికం; ఎలెక్షన్లలో శత్రువుని వోడించడం రాజకీయం. బహిర్గతచిహ్నాలకి బానిసత్వం చెయ్యడం వీళ్ల జీవితపు పరమావధి. నన్ను దేవుడుగా చేసిన యీవ్యక్తులు బానిసలుగా వున్నారంటే ఆశ్చర్యం లేదు. తుదకు దేవుడుకూడా భక్తులకి బానిసే కాబట్టి, నా మూడోనేత్రం నాబానిసత్వానికి బహిర్గతచిహ్నం.

నేను దైవాన్నని నిశ్చయం చేసుకున్నా. తలుపుతీసి దర్శనం యిచ్చా. మళ్లా హారతులు, కొబ్బరికాయలు, అర్చనలు, ఆరాధనలు — నా కిదంతా బాగానే వుంది. తాసీల్దారుని కసితీరా బుజాలమీద తన్నాను. పరమశివానికి నేను పదిరూపాయలు బాకీ— ఇంక చస్తే అడగడు నన్ను. పైపెచ్చు పెళ్లాం పుస్తె లేనా అమ్మ నా కేదో కానుక యిచ్చుగుంటాడు. హెడ్‌క్లార్కు ఆఫీసుకి ఆరునిమిషా లాలస్యంగా వెళ్లానని అరగంట లెక్చరిచ్చాడు మొన్న. రానీ చెబతా వాడి పని. మానవప్రపంచంలో దేవుడి కున్నంత పలుకుబడి ఏ ప్రతిభాశాలికీ లేదు. ఏమిటి కారణం? బలహీనుడు బలవంతుణ్ణి చూసి "నీకంటె బలం గల దేవు డున్నాడు పోవోయ్" అనొచ్చు. లేనివాడు వున్నవాణ్ణి చూసి "నీ కదంతా దేవు డిచ్చాడు, నీగొప్పేమేడిసింది" అనొచ్చు. పైగా అన్నిపాపాలూ, అసత్యాలూ, పశుత్వాలూ దేవుడిమీద తోసెయ్యవచ్చు. మానవుడి పశుత్వానికి 'మతం' వొక బహిర్గతచిహ్నం కాబోలు! పశువుగా వుండడం మానుకుని, మానవత్వం సంపాదించినప్పుడు మతం మాయమౌతుంది."

— నాకు రష్యాలో మతానికి స్థానం లేకపోవడం జ్ఞప్తికి వొచ్చింది.

"ఆమొన్నాడు రాజాగారి వద్దనుండి ఏనుగుని తీసుకొచ్చారు. రాజాగారికీ, రాణీగారికీ నాదర్శనం యిచ్చాను. ధన్యు లయ్యారు. నన్ను వాళ్ల భవనంలో వుంచేసుకుంటా మన్నారు. ఆనాడు జనం చేసిన కల్లోలం చూస్తే, న న్నక్కడే చంపేసి నా చుట్టూ గుడికట్టేస్తారేమోనని భయంవేసింది. ఏనుగుమీద రాత్రంతా ఊరేగించారు. అంబారీమీద పాలు త్రాగి హాయిగా పడుకున్నా. మధ్యలో తాసీల్దారు ఊరేగింపులో వున్నాడా లేడా అని లేచి చూసేవాణ్ణి. ఇంకా ఆయన నాయింటి కెళ్లి యేమన్నా చేస్తాడన్న భయం, అనుమానం పూర్తిగా వొదలందే! పాపం తాసీల్దారు, రాత్రంతా ఊరేగింపులోనే వున్నాడు. ఆయనకేసి చూసినప్పుడల్లా, తను నా అభిమానభక్తుడైనట్లు మొహం కొండంత చేసుకుని గర్వంగా తన్మయత చెందేవాడు.

మూడోనాడు పొరుగూళ్లనుంచి నన్ను చూడడానికి ఎగడ్డారు. ఆనాడు ఉదయమే నన్ను ఊరేగింపుకు తీసుకుపొయ్యారు. ఆ వొచ్చినవారిలో ఇద్దరు దొరలుకూడా వున్నారు. అందులో వొకాయన పోలీసు సూపరెంటుకూడా. నన్ను చూసి టోపీలు తీసి, చేత్తో రెండు బుజాలూ ముట్టుగున్నారు. నాకు ఆ అనుభవం చిత్రంగా వున్నా మనస్సంతా యింటిమీదే వుండేది. నాభార్య, నా పిల్లాడు ఎట్లా వున్నారో నని. నే నెంత బ్రతిమలాడినా, వొక్కళ్లూ నా యింటిదగ్గి రుండి, నాభార్యకి సహాయం చేసిన వాళ్లు లేరు. ఇదేం మనుషులో, వీళ్లకి బ్రతికి వున్న వాళ్లంటే బొత్తిగా గౌరవంలేదు. వీళ్ల దృష్టిలో, మనిషి, మనిషి కావాలంటే చావాలి.

నన్ను ఇంటికి పోనివ్వండి అని మొరెట్టుగున్నాను. వినిపించుకోలేదు. కోప్పడ్డాను; మూడోనేత్రం మూసేస్తా నన్నాను. సాయంత్రానికి ఇంటికి

జేశారు. ఈమార్పుకీ, యీ పిచ్చికీ కారణం పసి పిల్లాడు—వాడు నాకు పుట్టలేదని అనుమానం. పీక నొక్కి చంపేస్తే? చరచరా గదిలో కెళ్లాను.

తొందర్లో కాలు జారి మంచంకోడుకి నా మొహాన్ని కొట్టుకున్నాను. ఇదివరకులాగానే నుదుటి మీద మూడోనేత్రానికి తగిలింది. లేచి చూశా. ఎదురుగా మంత్రసాని నిలబడి, తల వొంచుకుని "పాప చచ్చిపొయ్యాడు" అని రెండుచేతుల్లో తన మొహాన్ని దాచుకొని గోడవెంపుకు నడిచింది. దెబ్బచోట నుదురు మండుతోంది. చెమట్లు పోశాయి. చేత్తో తుడుచుకున్నాను; రక్తం బొటబొటా కారుతోంది.

అది మూలుగూ, ఏడుపూ మొదలెట్టింది. నన్ను చూసి భయపడింది. "అయ్యో! కన్ను పోయింది. రక్తం, రక్తం. తడిగుడ్డ కట్టండి." నాభార్యను ఓదార్చడం మొదలెట్టాను. వాన కురిసి వెలిసినట్లుగా నాహృదయం చల్లబడి ప్రశాంతంగా మారింది. అసూయ లేదు; కోపం లేదు; విచారం అసలే లేదు. నా మూడో నేత్రంతోపాటు నా ఉద్రేకాలన్నీ పొయ్యాయి.

"లే, లే, ఏడవకు. కుటుంబం నాకు; కుముదం నీకు; పసిపాప దైవానికి. ఇంక నన్ను చూసి నువ్వు భయపడనక్కర్లేదు. మూడోకన్ను లేదు. నేను మామూలుమనిషినే..."

* * * *

కథ ముగిసిందికాబోలు శాస్త్రిగారు మాట్లాడడం మానేసి నిశ్శబ్దంలో పడ్డారు. అప్పటికి మేం ఊరుబైటికి వొచ్చినట్లు గ్రహించుకున్నాను. దూరంగా అది శ్మశానం. సూర్యుడు కిందికి పోతూ వొక్కసారి మాకేసి చూసి కన్ను గీటాడు. శాస్త్రిగారు కథ చెప్పినప్పుడు నాకెన్నో సందేహాలు తోచినా, యిప్పుడు అడగడానికి వొక్క ప్రశ్నకూడా కనబడలేదు. ఆకథ నిజమా, అబద్ధమా అన్న సమస్యే రాలేదు. మానవుడి అనుభవానికి 'సంభవం' అన్నది సరిహద్దు కాదు కాబోలు.

"అదిగో, ఆచెట్టుకిందే యీచేతులతో ఆ పసి పాపని పాతేశాను" అన్నారు శాస్త్రిగారు వెర్రిగా నవ్వుతూ. నాకళ్లు అప్రయత్నంగా తడిశాయి.

"వాడు వొంటరిగా వున్నాడనుకోవద్దు. వాడి తల్లి కూడా ముంచుకుపోయినట్లు పదేళ్లలో వాడిపక్కనే పడుకుంది. నా మూడోకన్ను తెరిచానంటే వాళ్లిద్దర్నీ చూడగలను—అదుగో..."

నే నాయనకేసి చూడలేక పొయ్యాను. నా కంటతడి నాకే సిగ్గేసింది. ఆయన ప్రాకృతిక శక్తులలో వొక శక్తిలా గోచరించాడు. ఆ గుట్టలు, ఆ చెట్లు, ఆయన—అందరూ సృష్టిలో లీనమయిపోయి గిరగిరా తిరిగిపోతున్నారు.

ఆయన చెయ్యి గట్టిగా పట్టుకున్నా. ఇద్దరం ఇంటివేపు నడవడం మొదలెట్టాం. ఊరుదగ్గరకి రాంగానే ధైర్యం తెచ్చుకుని—"మీ మూడోనేత్రం దేనికి బహిర్గత చిహ్నమో చెప్పారు కారు." అన్నాను.

"అసత్యానికీ, అంధత్వానికీ"

నా కర్థం కాలేదు.